క్లుప్తంగా

పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్‌ ఏర్పాటు



హెచ్‌ఎంకు ఆర్‌ఓ ప్లాంట్‌ను అందజేస్తున్న శ్రీనివాస్‌

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడిలోని ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్య నివారించడానికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ అనిత భర్త శ్రీనివాస్‌ ముందుకొచ్చారు. రూ.30 వేల ఖర్చుతో 500 లీటర్ల సామర్థ్యం గల ఆర్‌ఓ ప్లాంట్‌ను శనివారం పాఠశాలకు అందించి ఏర్పాటు చేయించాడు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం.దేవేందర్‌నాయక్‌ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. సమస్య గురించి వివరించిన వెంటనే స్పందించారన్నారు.

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని వినతి

మీర్‌పేట: కాలనీ అవసరాల కోసం వదిలేసిన స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని జిల్లెలగూడ సాయినగర్‌ కాలనీ వాసులు శనివారం కార్పొరేషన్‌ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 43వ డివిజన్‌ సాయినగర్‌లో గతంలో కాలనీ అవసరాల నిమిత్తం కొంత స్థలాన్ని వదిలేశారని, కాగా కొన్ని రోజులుగా ఓ వ్యక్తి ఇట్టి స్థలానికి సంబంధించి తన వద్ద ఇందిరమ్మ పట్టా ఉందని, తాజాగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు ఇది కాలనీకి సంబంధించిన స్థలమని, ఎవరికీ పట్టా మంజూరు చేయలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే నిర్మాణాన్ని నిలిపివేయాలని వారు కమిషనర్‌ను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జి.కృష్ణ, శోభారాణి, శాంతమ్మ, బాబురావు, జంగయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

రేపు రేషన్‌ కార్డుల పంపిణీ

బడంగ్‌పేట్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని 28వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు బాలాపూర్‌ మండల తహసీల్దార్‌ ఇందిరాదేవి తెలిపారు. మున్సిపల్‌ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రజాభవన్‌ ఫంక్షన్‌ హాలులో చేపట్టే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతారని వెల్లడించారు. లబ్ధిదారులు ఈ కార్యక్రమానికి విచ్చేసి రేషన్‌కార్డులు తీసుకోవాలని ఆమె కోరారు.

యూరియాపై వదంతులు నమ్మొద్దు

కందుకూరు: యూరియా కొరత ఉందంటూ బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు సృష్టిస్తున్న వదంతులను రైతులు నమ్మొద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేని ప్రతిపక్ష నాయకులు.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, ప్రజలు ఇలాంటి అసత్య ప్రచారాలను నమ్మొద్దని కోరారు. రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. రైతులు గంటల కొద్ది క్యూలైన్లలో యూరియా కోసం నిరీక్షిస్తున్నారని, సోషల్‌ మీడియాలో విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తం, ఆధార్‌కార్డు తీసుకొని వెళ్లి, తగినంత యూరియాను తెచ్చుకోవాలన్నారు. సీజన్‌కు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు భయపడాల్సిన పనిలేదన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

హుడాకాంప్లెక్స్‌: ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సరూర్‌నగర్‌ మండల తహసీల్దార్‌ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు టీఎస్‌ యూటీఎఫ్‌ మండల అధ్యక్షుడు రమావత్‌ తావురియా నాయక్‌ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందించామన్నారు.జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి, కిరణ్మయి,నీరజ, కరుణ, జంగయ్య పాల్గొన్నారు.

రీడింగ్‌ హాల్‌ ప్రారంభం

నాగోలు: చాణిక్యపురి కాలనీలో ఏర్పాటు చేసిన రీడింగ్‌ క్యాబిన్‌ హాల్‌ను ఉపయోగించుకోవాలని నాగోలు కార్పొరేటర్‌ చింతల అరుణ సురేందర్‌ యాదవ్‌ అన్నారు. శనివారం కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ పార్కులో సీనియర్‌ సిటిజన్‌ రీడింగ్‌ క్యాబిన్‌ హాల్‌ను ఆమె ప్రారంభించారు.

అప్రమత్తతే రక్ష..

పొంచి ఉన్న సీజనల్‌ వ్యాధుల ముప్పు

- గ్రామాల్లో పర్యటిస్తున్న వైద్య సిబ్బంది
- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు



దోమల నియంత్రణకు బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు (ఫైల్‌)

తుక్కుగూడ: వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధుల ప్రమాదం పొంచి ఉంది. తేమతో కూడిన వాతావరణం, నిలిచిన నీరు, సూర్యరశ్మి తక్కువగా ఉండటంతో రోగాల ముప్పు చాలా ఎక్కువ. వీటి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు సూచిస్తున్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మున్సిపాలిటీ సిబ్బంది సహాయంతో మురుగు నీరు నిలిచిన ప్రదేశాల్లో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లుతున్నారు.

జాగ్రత్తలు

- తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ఇంటిని పొడిగా ఉంచాలి. నీటిని కాచి, వడపోసి తాగాలి.
- ఇళ్లో, పరిసర ప్రాంతాల్లో మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమతెరలు, వాటి నివారణ మందులు, చేతుల నిండా దుస్తులు ధరించాలి.
- రోగనిరోధక శక్తిని పెంచే ఆహార పదార్థాలు పండ్లు, కూరగాయలను రోజు వారి భోజనంలో తీసుకోవాలి. తాజా ఆహారాన్ని తీసుకోవాలి. జర్వం, గొంతు నొప్పి, చర్మ సమస్యలు లేదా ఇతర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. స్వీయ చికిత్స నివారించాలి.

నివారణ చర్యలు

సీజనల్‌ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు వైద్యారోగ్య శాఖ పలు కార్యక్రమాలు చేపడుతోంది. బస్తీ దవాఖానాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు, రక్త నమూనాల సేకరణ, ఔషధాల పంపిణీ చేస్తోంది. దోమల నివారణకు ఫాగింగ్‌, నీటి నిల్వ ప్రాంతాల్లో లార్వా నియంత్రణ రసాయనాలు చల్లుతున్నారు. వీధులు, రోడ్లు, గృహాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. పరిశుభ్రత చాలా ముఖ్యం. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా.. వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైరల్‌ ఫీవర్ల గురించి అవగాహన కలిపిస్తున్నాం.

– స్వరూప, లేమూరు క్లస్టర్‌ వైద్యురాలు



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న మాజీ సీఎస్‌ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, తీగల కృష్ణారెడ్డి

టెక్నాలజీకి అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలి

- మాజీ సీఎస్‌ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం

మీర్‌పేట: మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు కోర్సులను ఎంపిక చేసుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం సూచించారు. మీర్‌పేటలోని టీకేఆర్‌ ఇంజినీరింగ్‌ కళాశాల 5వ గ్రాడ్యుయేషన్‌డే వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గ్రాడ్యుయేషన్‌ పూర్తవగానే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా భవిష్యత్‌ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ఉంటూ, తమ చదువు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులకు పట్టాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కళాశాల చైర్మన్‌ తీగల కృష్ణారెడ్డి, సెక్రటరీ హరినాథ్‌రెడ్డి, కోశాధికారి అమర్‌నాథ్‌, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి ప్రిన్సిపాల్స్‌ రవిశంకర్‌, మురళీమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి, అమీర్‌పేట్‌లోని సీతారాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పలంకరణతో పాటు తమలపాకులతో అర్చన పూజ కార్యక్రమాలు చేశారు. ఘట్టుపల్లి ఆలయంలో దంపతులు శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. శనివారం కావడంతో మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్‌ ఆలయ అర్చకులు తొండుపల్లి సంతోష్‌శర్మ, వీరేశం, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్యముదిరాజ్‌, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

- నిండుకుండలా రావిర్యాల, సూరం



రావిర్యాల చెరువు

తుక్కుగూడ: జలకళతో చెరువులు కళకళలాడుతున్నాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పురపాలిక పరిధి మంఖాల్‌ చెరువు, తుక్కుగూడ సూరం చెరువు, రావిర్యాల పెద్ద చెరువుల్లోకి భారీగా నీరు చేరి, నిండు కుండలా కనువిందు చేస్తున్నాయి. పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉన్నాయి. మరిన్ని వర్షాలతో అలుగు పారే అవకాశం ఉంది. మూడు దశాబ్దాల కాలంలో 2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు.. అడుగంటిన చెరువులు కాస్త.. నీటితో నిండాయి. ఆ తరువాత గడిచిన ఐదేళ్లుగా వానలు పడుతుండటంతో నీరు ఏమాత్రం తగ్గలేదు.

16వ శతాబ్దంలో..

బాగ్‌ మంఖాల్‌ చెరువు నిండితే పులిందర్‌ వాగు నుంచి నీరు రావిర్యాల చెరువులోకి, సూరం చెరువు నిండితే కాల్వల ద్వారా బొమ్మల కుంట నుంచి పులిందర్‌ వాగులో కలిసి రావిర్యాల చెరువులోకి వరద చేరుతుంది. జిల్లాలోని అతి పెద్ద చెరువుల్లో రావిర్యాల ఒక్కటి. దీనిని 16వ శతాబ్దంలో నిజాం పాలకులు నిర్మించారు. 1.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన చెరువు కింద.. రావిర్యాల, ఆదిబట్ల తదితర ప్రాంతాల రైతులు వందల ఎకరాల్లో పంటలు పండించేవారు.

కబ్జాలో కాల్వలు

బాగ్‌ మంఖాల్‌ నుంచి రావిర్యాల చెరువులోకి నీరు వచ్చే పులిందర్‌ వాగు, సూరం చెరువు నుంచి బొమ్మలకుంటకు నీరు వచ్చే కాల్వలను రియల్టర్లు కబ్జాచేసి, ధ్వంసం చేశారు. ఇదే విషయమై ఇరిగేషన్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కాల్వలను గుర్తించి కాపాడాలని కోరుతున్నారు.



తుక్కుగూడ సూరం చెరువు

చెట్లతోనే మానవాళి మనుగడ



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, నీరు పోస్తున్న కమిషనర్‌ వెంకట్రామ్‌

పహాడీషరీఫ్‌: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్‌ బి.వెంకట్రామ్‌ తెలిపారు. మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీ ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ ప్రదేశాలలో భారీగా మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వన మహోత్సవం ఇన్‌చార్జి సుధీర్‌, పర్యావరణ అధికారి ఎం.శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి



విద్యార్థులకు షూస్‌, వాటర్‌బాటిల్స్‌ అందజేస్తున్న కమలా సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్‌: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని జయచంద్రారెడ్డి చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్‌పర్సన్‌ దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి అన్నారు. జక్కిడి చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ జక్కిడి రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాటర్‌ బాటిల్స్‌, షూస్‌, సాక్స్‌ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పాఠశాలలోని సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామలింగం, అరుణ, సిద్దు, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్‌, రామచంద్రారెడ్డి, నర్రి వెంకన్న, భాస్కర్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు



ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్‌ భాగ్యలక్ష్మికి సన్మానం

మలక్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల అన్నారు. మూసారంబాగ్‌ డివిజన్‌ ఎస్‌బీఐ ఆఫీసర్స్‌ కాలనీలో రూ. 51 లక్షల ఎమ్మెల్యే నిధులతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్‌ పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్‌, రోడ్లు, పార్కులు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పూర్తి చేశామన్నారు. పెండింగ్‌ ఉన్న వాటిని సత్వరమే పూర్త చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించబోమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కాలనీవాసులు దండెం రాజశేఖర్‌రెడ్డి, రంగాచార్యులు, హరిగోవింద్‌, కృష్ణారావు, గోవుల రాములు, మజ్లిస్‌ నేత ఇలియాస్‌, వాటర్‌ వర్క్స్‌ డీజీఎం హస్మత్‌అలీ, ఏరియా మేనేజర్‌ వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు

చాదర్‌ఘాట్‌: మలక్‌పేట మహబూబ్‌ మాన్షన్‌ మార్కెట్‌లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని హైదరాబాద్‌ నగర వ్యవసాయ మార్కెట్‌ కమిటీ ఎస్‌జీఎస్‌ చిలుక నరసింహారెడ్డి పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన మహబూబ్‌ మాన్షన్‌ మార్కెట్‌లో జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించి డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ మురుగు రోడ్లపై పారకుండా, వర్షపు నీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజ్ఞారెడ్డి, మోబిన్‌, నాగరాజు, మార్కెట్‌ సిబ్బంది పవన్‌, శ్రీకాంత్‌, పెద్ద రవి, నరేందర్‌ పాల్గొన్నారు.